# వారానికి అయిదు రోజులు

పనిచేసే సమయం ఉదయం పది గంటల నుంచీ సాయంత్రం ఆరింటి వరకూ మరో గంట పెంచి, శనివారం కూడా సెలవు దినంగా ప్రకటించడంతో అటు ఉద్యోగులకీ, యిటు ప్రభుత్వానికీ కొన్ని లాభాలు ఉండొచ్చు. ఉంటాయని ఆశించే కొన్నేళ్ళ క్రితం ఈ మార్పు తెచ్చారు. ఉద్యోగులకి తగినంత మానసిక, శారీరక విశ్రాంతి లభించి, తీరుబడిగా శనాదివారాల్లో స్వంత పనులు చూసుకోవడానికీ, సంత పనులు చేసుకోవడానికీ వీలు దొరుకుతుంది. ఆఫీసు పనులు చేసేటప్పటి అలసట స్వంత పనుల్లో కనబడదుగా మరి. దీంతో స్వంత పనులు చేసుకోవడానికి ఆఫీసుల్నుంచి గైరుహాజరు తగ్గుతుంది. (?) వాహనాల వాడకం తగ్గి, యింధనం వాడుక ఎంతో కొంత తగ్గి దేశానికి అంతో, యింతో విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఆఫీసులకి విద్యుత్ బిల్లులు తగ్గుతాయి. ఉద్యోగులకి బంధుదర్శనానికి, భగవద్దర్శనానికీ, వినోద కార్యక్రమాలకీ, యివేవీ కాకపోతే పిల్లకి హోంవర్క్‌లో సాయపడ్డానికీ వీలుంటుంది.

కాని బొరుసు లేని నాణెం ఉండదు కదా? ప్రపంచవ్యాప్తంగా సేకరించిన గణాంకాల ప్రకారం, రోజులో వ్యక్తులు సమర్థవంతంగా, ప్రయోజనకరంగా పనిచేసే కాలం సగటున



మూడు గంటలు దాటదని అంచనా వేయడం జరిగింది. దీనివల్ల జరిగేదేమిటంటే రోజూ ఓ గంట పెంచి శనివారం శలవిచ్చినా, రోజూ జరిగే పని ఎంత జరుగుతుందో అంతే జరుగుతుంది తప్ప, శనివారం లభించే మూడు సమర్థవంతమైన గంటల ఉత్పత్తిని దేశం కోల్పోతుంది.

దిగువ, మధ్య హోదాల్లో ఉన్న ఉద్యోగులకి వారానికి అయిదు రోజుల పద్ధతి బాగానే ఉన్నా, శనాదివారాల్లోనూ, సెలవు రోజుల్లోనూ కూడా ఆఫీసులకి వెళ్ళవలసిన అగత్యం మాటిమాటికీ ఉన్న ఉన్నతాధికారులకి, ఏ విధమైన సహాయమూ లేకుండా ఒంటరిగా పనిచేసుకోవడం తలనొప్పి వ్యవహారమే. పనిరోజుల్లో కూడా ఆఫీసు సమయం దాటి ఉండవలసినప్పుడు కూడా యిదే పరిస్థితి తప్పదు. కారణాలనేకం ఉన్నా, ఆఫీసు సమయాన్ని ఉదయమూ, సాయంత్రమూ కొరుక్కు తినే కాలహరణం ముఖ్యమైన వాటిల్లో ఒకటి. ఓవర్‌టైం యిచ్చి - అంటే మామూలు రోజుల్లో అధిక సమయం ఉంచి, లేదా సెలవు రోజుల్లో పిలిచి పని చేయించుకోవడమనేది ఎల్లప్పుడూ సాధ్యపడదు.

నా ఆఫీసులో ముగ్గురు స్టెనోలు పన్జేస్తున్నారు. రీజియనల్ ఆఫీసులో పన్జేస్తున్న అందరు స్టెనోలలోనూ వీళ్ళు ముగ్గురూ సీనియర్లు. అందుకని నా కన్నా తక్కువ హోదాలో ఉన్న ఆఫీసర్ల దగ్గర వీళ్ళు పని చెయ్యరు, చెయ్యడానికి యిష్టపడరు. వీళ్ళు మిగిలిన స్టెనోల మీదనే కాకుండా, వాళ్ళ బాస్‌ల మీద కూడా నా ఆఫీసు పేరు చెప్పి అధికారం చెలాయిస్తారు. *'యింతవరకూ బాగానే ఉంది'* అని చెప్పుకోవడంలో అంతగా ఒప్పు

లేకపోయినా, వచ్చిన చికాకేమిటంటే వీళ్ళు ముగ్గురూ స్త్రీలు.

'వారానికి అయిదు రోజులు' అన్న ప్రతిపాదన వచ్చినప్పుడు, పది నుంచి అయిదు దాకా ఉండే సమయాన్ని తొమ్మిది నుంచి అయిదు దాకా చేసి, శనివారం శలవు అన్నారు. స్త్రీ ఉద్యోగులందరూ హోదాలతో నిమిత్తం లేకుండా, కార్మిక సంఘాల సహాయంతోనూ, కార్మిక సంఘాలని అడ్డుపెట్టుకొనీ ఈ ప్రతిపాదనని అంగీకరించకుండా హోరెత్తించేశారు. 'లేచి అత్తమామలకి సేవ చెయ్యాలి(?) పిల్లల్ని స్కూళ్ళకి పంపించాలి. భర్తల్ని ఆఫీసులకి సాగనంపాలి. పదికి ముందు రావడం కుదరదంటే కుదర'దన్నారు. పదింటి నుంచి ఆరింటి వరకూ ఉంచి, శనివారం సెలవు రోజంటే పర్వాలేదన్నారు. ప్రభుత్వమూ సరేనంది. నిజానికి పది నుంచి అయిదు వరకూ ఆఫీసులున్న రోజుల్లో కూడా, వీళ్ళేమిటి, చాలా మంది ఆఫీసు ముఖం చూసేది పదిన్నర తర్వాతే! యిల్లు వదిలి, ఆఫీసు చేరే ప్రయాణ కాలం కూడా ఆఫీసు డ్యూటీలో జమ చేసుకోవలసిన అవసరముందని వాదించే తీవ్రవాదులు కూడా వీళ్ళలో చాలామంది ఉన్నారు. ఆఫీసు సమయం మొదలైనప్పుడు యిల్లు వదిలి, ఆఫీసు సమయం ముగిసే సరికి ఇల్లు చేరాలన్నది వీళ్ళ నైజం.

ఓ రోజు నా టెక్నికల్ సెల్‌లో పన్జేసే కుర్ర సైంటిస్ట్ 'సక్సేనా' గంట ఆలస్యంగా వచ్చాడు. నాకు అతని అవసరం వచ్చి ఉండడం వల్ల విసుక్కొంటూ కాస్త మందలించాను.

మూడ్ పాడవడం అనేది ఒక్క పెద్దాఫీసర్లకే కాదు, అందరికీ అవుతోనే ఉంటుంది. అది అందరి హక్కు కూడా. "మా సైంటిస్ట్‌లూ, టెక్నికల్ ఆఫీసర్లూ మీకు లోకువ సార్! మీ స్టెనోలు ముగ్గురూ ప్రతిరోజూ ఆలస్యంగా వచ్చి, పెందరాళే ఉడాయించేస్తారు! కాని వాళ్ళనేమీ అనరు! కంప్యూటర్ని వర్డ్ ప్రాసెసర్‌గా ఉపయోగించి అయిదు దాటిన తర్వాత అర్జంటుగా మీకు కావల్సిన కాయితాల్ని నేను టైప్ చెయ్యవలసి వస్తోంది!" అనేశాడు నిర్మొహమాటంగా.

డిక్టేషన్ తీసుకోవడానికి వచ్చి, అదే సమయంలో అక్కడే ఉన్న స్టెనో 'ఛాయ' పైకప్పుకేసి చూడ్డం ప్రారంభించింది. నాకో స్వర్ణావకాశం దొరికిందనుకొంటూ అరుణనీ, ఉషనీ - అంటే మిగిలిన యిద్దరు స్టెనోలనీ యింటర్‌కాంలో పిలిచాను. వాళ్ళిద్దరూ హడావుడి వచ్చి కూర్చున్నారు. నేను సక్సేనా వైపు చూస్తూ, "యిందాకా అన్న మాటల్ని మరోసారి చెప్పు" అన్నాను. సక్సేనా మౌనంగా ఉండిపోయాడు, యిబ్బందిగా మొహం పెడ్తూ.

"పోనీ, ఛాయా! నువ్వైనా చెప్పు" అన్నాను.

ఛాయ యింకా సీలింగ్ వైపే చూస్తూ ఉండిపోయింది. యింక లాభం లేదనుకొని నేనే తిరిగి అన్నాను.

"ఆలస్యంగా వచ్చినందుకు సక్సేనాని మందలించాను. ప్రతి రోజూ ఆలస్యంగా వచ్చి, పెందరాళే వెళ్ళిపోయే మీ సంగతేమిటని ప్రశ్నించాడు! మరి మీరేమంటారు?"

ముగ్గురూ తెల్లబోయిన ముఖాలతో చూస్తూ ఉండిపోయారే కాని నోరు విప్పలేదు.

"మీ ముగ్గురి ప్రవర్తన మూలాన ఈ రోజు సక్సేనా చేత మాటపడవలసి వచ్చింది. గుడ్డి కన్నా మెల్ల నయమన్నట్టుగా మీరందరూ నా సెల్‌లో పన్జేయడం వల్ల సరిపోయింది కాని, ఏ సెక్షనల్ హెడ్ అయినా ప్రశ్నిస్తే నా దగ్గర సమాధానమేముంది? నా దగ్గర పని చేసే మీరందరూ క్రమశిక్షణా, సమయపాలనా పాటిస్తే మిగిలిన వాళ్ళకి చెప్పగల నైతిక బలం నా కుంటుంది. కానిపక్షంలో, ఎవర్నీ అనే అధికారం నాకు లేకుండా చేసి నట్టవుతుంది, అవునా?" - కోపంగా కాదు కాని, కాస్త గట్టిగానే అన్నాను.

వాళ్ళు ముగ్గురూ రుమాళ్ళు తీసుకొని కళ్ళు తుడుచుకోవడం ప్రారంభించారు.

ముగ్గురులోను ఉష సీనియర్ - "ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడంలో గల సాధక బాధకాలు మీకు తెలియనివి కావు సార్! పొద్దుననగా స్కూళ్ళకి పోయిన పిల్లలు సాయంత్రానికల్లా ఆవురావురుమంటూ వస్తారు. ఆ సమయానికి యింటికి చేరుకోవాలన్న సహజమైన ఆతృత ఉంటుంది, ఏం చెయ్యమంటారు?" అంది కాస్త ధైర్యం కూడదీసుకొని.

ఉదయం ఆలస్యంగా వచ్చేందుకు గల కారణాల్ని చెప్పలేదు - ఎందుకంటే ఆడా, మగా అందరూ అంతో, యింతో ఆలస్యంగా వస్తారు. లౌక్యురాలు! కాని పెందరాళే వెళ్ళేందుకు గల ఆమె చెప్పని కారణాలు ఊహించడం కష్టం కాదు. చీకటీ, అనుమానించే కుటుంబ సభ్యులూ స్త్రీ ఉద్యోగికి శత్రువులు.

"మీరేం చేసినా నాకు మాట రాని విధంగా ప్రవర్తిస్తే చాలు!" అని ముగ్గుర్నీ పంపిం చేశాను.

"సార్! మీ ఎత్తు గ్రహించాను కాని, కాస్త జాగ్రత్తగా ఉండడం మంచిది. ఆఫీసులో ఆడది కంటతడి బెడ్తే అభాండాలు నెత్తిన పడే అవకాశముంది!" అన్నాడు సక్సేనా వేదాంతిలా మొహం పెట్టి.

నిజమే! స్త్రీ ఉద్యోగులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఆ తర్వాత మధ్యాహ్నం ఎప్పుడో ఉష నాతో అంది.

"సార్! సక్సేనాని మీరు ఛాయ ముందూ, మా ముగ్గుర్నీ సక్సేనా ముందూ మంద లించకుండా ఉండవల్సింది!"

ఆమె మాటల్లోనూ నిజం లేకపోలేదు. అధికారి అన్నవాడు తన కింది ఉద్యోగుల్ని విడివిడిగా, ఒకరికి తెలియకుండా మరొకర్ని మందలించాలి. సామూహికంగా మెచ్చుకోవాలి.

ఆ రోజు వాళ్ళు నలుగురూ కలిసి నాకో పాఠం నేర్పారు. ఆ పాఠం నాకు కాస్తింత లౌక్యాన్ని నేర్పుతుందే కాని, ఆశించిన ఫలితాన్ని సాధించిపెడుతుందా అని?